www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 మే 2023
5
కాకినాడ



గండంగా మారిన పెద్ద గుండం

ప్రజాశక్తి- తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ పరిధిలో సుమారు 23 ఎకరాల్లో ఉన్న పెద్దగుండం పేరు గుర్రపు డెక్కతో మూసుకుపోవడం వల్ల, అకాల వర్షాల సమయంలో వర్షపు నీరు కిందకు వెళ్లక, పండిన పంట కుళ్లి పోతోందని దీని వల్ల ఈ ప్రాంతం లోని సుమారు 400 ఎకరాలు పంట చేలు ప్రతి ఏటా ముంపు పాలవుతున్నాయని గుండంలో మట్టి పేరుకుపోయి గుర్రపుడెక్కతో మూసుకు పోయిందని రైతులు మట్టపర్తి సుబ్బారావు, చిట్టూరి శ్రీనివాస్, కాలా లోవకుమార్, రాయుడు గోవిందు ఆవేదన వ్యక్తం చేశారు.


గుర్రపు డెక్కతో నిండిపోయిన పెద్దగుండం


పిఠాపురం మండలం కందరాడలో నీటిలో నానుతున్న పనలను చూపుతున్న రైతులు

తేలుతున్న నష్టం...

● నిండా మునిగిన అన్నదాతలు ● మొలకలు వస్తున్న ధాన్యం ● కంటి తుడుపు చర్యలకే సర్కారు పరిమితం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అకాల వర్షాలతో రైతులు నిండా మునిగారు. అతి కొద్ది రోజుల్లోనే చేతి కొస్తుందనుకున్న పంట కళ్ల ఎదుటే నీట నానుతుంది. అయినా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు గగ్గోలు పెడుతున్నారు. నష్టాన్ని తలచు కుంటూ విలవిలలాడుతున్నారు. వరుసగా నాలుగు రోజులు పాటు ఎడతెరిపి లేని వర్షానికి నేలను తాకి నానుతున్న పంట, తడిసి ముద్దయిన ధాన్యం రాశుల నుంచి వస్తున్న మొలకలను చూసి కన్నీళ్లు పెడుతుండగా వారిని అన్ని విధాల ఆదుకోవాల్సిన సర్కారు కంటి తుడుపు చర్యలకు మాత్రమే పరిమితం అవుతుంది.

కాకినాడ జిల్లాలో ఉన్న 20 మండలాల్లో దాదాపు 140 గ్రామాల్లో అకాల వర్షాల ప్రభావం పడింది. దీంతో భారీగానే రైతులు నష్టపోయారు. 1.63 లక్షల ఎకరాల్లో ఈసారి రబీ వేయగా సుమారు 80 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, సుమారు 6 వేల ఎకరాల్లో కోయని వరి నేలను తాకిందని, 7 వేల ఎకరాల్లో వరి పనలపై ఉండగా తడిసి ముద్దయిందని, 7 వేల ఎకరాల్లో సుమారుగా 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లల్లోనే ఉండిపోయిందని అధికారులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి వారం, పది రోజుల్లోనే చేతికి అందివచ్చే పంట నీట మునిగిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వాస్తవా నికి 20 వేల ఎకరాలకు పైనే నేలను తాకిన వరి ఎందుకు పనికి రాకుండా పోయింది. కోసి పనలపై ఉన్న ధాన్యం మొత్తం మొలకలు వచ్చి నాశనమైం దని చెబుతున్నారు. పలు గ్రామాల్లో ఎక్కడ చూసినా ధాన్యం రాశులు రోడ్ల ప్రక్కల గుట్టలు గుట్టలుగా దర్శన మిస్తున్నాయి. ఆరబెట్టేందుకు కూడా అవకాశం లేకపోవడంతో తడిసి ముద్దయి సగం పంట మొలకలు వచ్చినట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ధాన్యాన్ని తక్షణమే నిబంధనలను పక్కన పెట్టి కొనుగోలు చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కాలువల్లో పేరుకుపోయిన పూడిక

పలు పంట కాలువల్లో, డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడంతో అకాల వర్షాలతో రైతులకు నష్టాలు తప్పలేదు. వర్షపు నీరు పొలాల నుంచి బయటకు పోవడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. పేరుకుపోయిన పూడికను తొలగించక పోవడం తోనే నీరు నిలవ ఉండిపోయింది. దీంతో రైతులు తమ పంటలను కోల్పోవాల్సి వచ్చింది. పంట కాలువలు ఆధునీకరణ చేపట్టక పోవడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు పలువురు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

నిబంధనలను సడలించి అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి సంబంధించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి. నెలలు తరబడి ధాన్యం డబ్బులు పెండింగ్ లో ఉంచకుండా వారం రోజుల్లోనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

వల్లు రాజబాబు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి



పూర్తిగా నష్టపోయా...

ఎకరంలో వేసిన పంట అంతా పూర్తిగా నష్టపోయాను. ధాన్యం మొలకలు రావడంతో రూ.45 వేల వరకూ పెట్టిన పెట్టుబడి తుడిచిపెట్టుకు పోయింది. నా లాంటి రైతులకు అధికారులు ఎటువంటి భరోసా ఇవ్వలేకపోతున్నారు.

కొత్తెం లోవరాజు, కౌలు రైతు, గోకివాడ, పిఠాపురం మండలం



తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది

ఆరు ఎకరాలు కౌలుకి తీసుకొని సాగు చేశాను. ధాన్యం రాశులు సగం పూర్తిగా తడిసి మొలకలు వచ్చాయి. ఆరబెడదా మంటే తెరిపి ఇవ్వడం లేదు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను.అప్పుడు అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

పెల్లి దుర్గబాబు, రైతు, కోలంక, కాజులూరు మండలం

మొలకలు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఎకరాకు రూ. 50 వేలు పెట్టుబడి పెట్టి 5 ఎకరాల్లో రబీ సాగు చేశాను. అకాల వర్షాలు నిండా ముంచెత్తాయి. ధాన్యం రాశులు తడిసి ముద్దయి మొలకలు వస్తున్నాయి. సగం పంట నాశనం అయింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

రెడ్డి చంద్రరావు, కౌలు రైతు, కరప




జార్జి పేటలో నేలకొరిగిన పంటచేలు ... (ఇన్‌సెట్‌లో) మొలకలు వస్తున్న ధాన్యం

ఏ రైతును కదిలించినా కన్నీళ్లే..

● అకాల వర్షాలకు నేలకొరిగిన పంట ● మొలకలు వస్తున్న ధాన్యం

ప్రజాశక్తి- తాళ్లరేవు

అకాల వర్షాలతో పంట నష్టపోయిన ఏ రైతును కదిలించిన కన్నీటి పర్యంత మవుతు న్నారు. తాళ్ళరేవు మండలంలో సుమారు 8 వేల 611 ఎకరాల్లో వరి సాగు చేయగా మార్చి నెలాఖరు వరకు నీటి ఎద్దడి కారణంగా అరకొరగా పంటలు పండాయి.20 శాతం రైతులు కోతలు పూర్తి చేశారు. కళ్లాల్లో ధాన్యాన్ని అమ్ముకుందామనంటే ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు జరగాలని నిబంధనలు పెట్టడంతో రైతులు ధాన్యాన్ని సకాలంలో అమ్ముకోలేకపోయారు. రైతు భరోసా కేంద్రాల వద్ద గోనె సంచులు లేక, సంచులు ఉన్న చోట ధాన్యం తూకం వేసే సిబ్బంది లేక, రవాణా సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో ఎక్కడి ధాన్యపు రాశులు అక్కడే ఉండిపోయాయి. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు కళ్లాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్ద య్యాయి. తడిసి ముద్దయిన ధాన్యం కొనేవారు లేకపోవడంతో ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. వరిలో తేమ శాతం ఉందని ధరలు తగ్గించా రని వాపోతున్నారు. పంట ఎలా ఉన్నా కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.


పి.మల్లవరం ఆర్‌బికెలో చిరిగిపోయిన గోనె సంచులు



ఏ ఒక్క అధికారీ రాలేదు

సుమారు 6 ఎకరాలు కోత కోసి మాసూలు చేసి వారం రోజులు కావస్తుంది. ఏ ఒక్క అధికారి రాలేదు. అకాల వర్షానికి ధాన్యం తడిసి పోవడంతో కొద్ది మేరకు మొలకలు వచ్చేసాయి. మిగిలిన ధాన్యాన్ని ఆం బెడుతున్నాం. ఆర్‌బికె అధికారులకు ఫోన్ చేస్తే ధాన్యం తూకం వేసే సిబ్బంది లేరని చెబుతున్నారు.

చిట్టూరి రామకోటి నారాయణ. రైతు, పత్తి గొంది



నాకున్న రెండు కుంచాల భూమి అమ్మితే గానీ అప్పులు తీరవు...

గత కొన్నేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తు న్నాను. ఈ ఏడాది ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాను. ఇంతవరకు కోత కోయలేదు. అకాల వర్షాలకు పంట మునిగిపోయింది. ఒక్క పన కూడా కోయ లేదు. గత రెండేళ్లుగా రూ.2.50 లక్షలు నష్టం వచ్చింది. వ్యవసాయమే నమ్ముకుని జీవి స్తున్నాం. కనీస పెట్టు బడి కూడా రాక, చేసిన అప్పులు తీర్చడానికి నాకున్న రెండు కుంచాల పొలం అమ్మాల్సి వస్తుంది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

శీలం సుబ్బారావు. కౌలు రైతు పి. మల్లవరం



గుండమే గండంగా మారింది

నీటి ఎద్దడి సమయం లో రైతులకు ఉపయోగపడే గుండమే ఇప్పుడు గండంగా మారింది. గుండంలో నీరు దిగక పంట చేలు కుళ్లిపోతున్నాయి. పి. మల్లవరంలో ఉన్న ప్రధాన గుండంలో నీరు కింద ఉన్న మందార కాలువకు సక్రమంగా వెళ్లక పోవడం వల్ల పంట చేలు కుళ్లిపోతున్నాయి. గుండం మొత్తం గుర్రపు డెక్కతో మూసుకుపోయింది. ఉపాధి హామీ పథకం ద్వారా గుండాన్ని బాగు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. అప్పటివరకు పంటచేలు కుళ్లి పోవాల్సిందే.

మట్టపర్తి సుబ్బారావు. రైతు. పి.మల్లవరం పంచాయతీ

హమాలీలు, గోనెసంచుల కొరత లేదు

హమాలీలు, గోనె సంచుల కొరత లేదు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి రైతు భరోసా కేంద్రాల్లో గోని సంచులు ఉన్నాయి. హమాలీల కొరత లేదు. మండలానికి ప్రత్యేకంగా ఐదు ట్రాక్టర్లు కేటా యించారు. రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి గింజను కొనుగోలు చేస్తాం.

ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి

ధాన్యం కొనుగోలు చేస్తాం

ఇప్పటికి 12 వేల మెట్రిక్ టన్నుల సేకరణ : జెసి ఇలాక్కియా

ప్రజాశక్తి - కాకినాడ

రబీ సీజన్‌కు సంబంధించి కాకినాడ జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశామని రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యపు గింజనూ తప్పనిసరిగా కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా గురు వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా, సాఫీగా జరిగేందుకు వీలుగా మండల స్థాయిలో నియమించిన ప్రత్యేక అధికారులు జిల్లా స్థాయి అధికారులతో సమన్వయం చేసు కుంటూ మండల స్థాయిలో రైతులు, మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి, రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రత్యేక అధికారులు, ఆర్‌డిఒలు, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించాలని రైతులతో మాట్లాడి, ఏ సమస్య ఉన్నా తక్షణం పరిష్కరించాలన్నారు. పంట పొలాల నుంచి నీరు బయటకు పోవడానికి వీలుగా కాలువలను శుభ్రపరుస్తున్నామని కాలువల్లో కలుపును తీసే పనిని ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్నట్లు వివరించారుజ ఎక్కడైనా కోసిన వరి పనలు నీటిలో మునిగితే గింజలు తడిచి మొలకెత్తి, రంగు మారే అవకాశముందని అందువల్ల రైతులు అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనల మీద ముఖ్యంగా కంకుల మీద పడేటట్లు 5 కిలోల ఉప్పును 100 లీటర్ల నీటిలో కరిగించి ఆ ద్రావకాన్ని పనలు, కంకులపై చల్లడంవల్ల గింజలు మొలకెత్తవని జెసి సూచించారు.

రైతులు అధైర్య పడవద్దు..

ప్రజాశక్తి- తాళ్లరేవు

రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతాంగం అప్రమత్తంగా ఉండి పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కాకినాడ ఇంచార్జ్ ఆర్డీ. ఓ.జె. సీతారామారావు అన్నారు. తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామములో పర్యటించి ధాన్యము నమూనాలను పరిశీలించి,సస్య రక్షణ చర్యలు చేపట్టాలని అందుకు రైతాంగానికి సూచనలు సలహాలు ఇవ్వవల సిందిగా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యమును తప్పనిసరిగా కొనుగోలు చేస్తా మని ఇందుకు రైతు భరోసా కేంద్రాలు విని యోగించుకోవాలని రైతులకు రవాణా, గోనెసంచులు, హామాలీలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ పర్యటనలో ఆర్డీవో వెంట తహశీల్దార్ పోతురాజు, మండల పరిషత్ అభివద్ధి అధికారి అనుపమ, ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి వరహాలయ్య. రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పి మల్లవరం పంచాయతీ పరిధిలో మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి, తహశీల్దార్ పోతురాజు, సచివాలయ అధికా రులు ప్రత్యేకంగా పర్యటించి రైతులతో మాట్లాడారు.


కరపలో కౌలు రైతు సంఘం నాయకులకు కష్టాలు చెప్పుకుంటున్న కౌలు రైతు

రైతులను ఆదుకోవాలి

● ప్రత్యేకాధికారిని నియమించాలి ● జిల్లా రైతు, కౌలు రైతు సంఘం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -కరప

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కాకినాడ జిల్లాలో ధాన్యం రాశులు, వరి పొలాలు వర్షం నీటితో మునిగి ధాన్యం రాశు లు మొలకెత్తి రైతులు తీవ్ర నష్టాలకు గురైన పరిస్థితుల్ని కాకినాడ జిల్లా రైతు, కౌలు రైతు సంఘం నాయకులు స్వయంగా పరిశీలించారు. నిబంధనలను సడలించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.నాగేశ్వర రావు, కౌలు రైతులు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించి వరి పొలాలను పరిశీలించారు కరపలో పొలాలలోని ధాన్యం ఆరబెడుతున్న కౌలురైతు రెడ్డి చంద్రరావు, వెంకట్రావు, నక్కా సాంబయ్య, మేడిశెట్టి రాంబాబు, పేకేటి శ్రీను తదితర రైతుల వద్దకు వెళ్లివద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంఘాల నాయకులు మాట్లాడుతూ మండలంలోని 15 శాతం మాత్రమే మసూళ్లుజరిగాయని, ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తా యన్నారు. రైతుల కోసం పనిచేసే ప్రభుత్వమే అయితే నిబంధనలు అన్ని సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులు అమ్మిన ధాన్యానికి ఆరు రోజుల్లోగా సొమ్ములు వారి ఖాతాల్లో జమ చేయాలని. ఈ క్రాప్‌లో కౌలు రైతులను చేర్పించి మేలు చేయాలని, 80 శాతం కౌలు కు సాగు చేస్తున్న కౌలు రైతులకే ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క గింజ కూడా ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు జరగడం లేదని. కొనుగోళు దళారుల ద్వారా జరుగుతున్నదని వాటిని రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేసినట్లు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఈ దళారుల ద్వారా వెళ్లిన ధాన్యాన్ని రోజులు తరబడి వచ్చిన వాహనాలను నిలిపి వేస్తున్నారని, మొలకలు, తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి వాటిని నిలిపివేస్తూ బస్తా 850 నుండి 950 వరకు ధర ఇస్తామని బేరసారాలు చేస్తున్నారన్నారు.. రైతుల వద్దకు ఆర్‌బికెల అధికారులు వచ్చి కళ్ళల్లో ధాన్యాన్ని పరిశీలించే పరిస్థితి లేదని, పరిశీలించినా ట్రాక్ సీట్లు లేవని సమాధానం చెబుతున్నారని రైతులు గగ్గోలు పెడుతు న్నారన్నారు. ఇదే పరిస్థితిలో జిల్లా వ్యాప్తంగా ఉందని, ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే మండలానికి ఒక ప్రత్యేక అధికారి నియమించి వారి పరివేక్ష ణలోని గ్రామ స్థాయిలో వ్యవసాయ అధికారులు, రైతు భరోసా అధికారులు రైతులను చైతన్యపరిచి ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు తెలిపారు. అనంతరం కరప రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రశాంత్ కుమార్‌తో ఫోన్లో సంప్రదించి దళారులు రైతులను మభ్యపెట్టి బస్తా రూ.850 నుండి రూ.95కు కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని దళాలు బారిన పడకుండా రైతులను పిలిపించి రైతు భరోసా ద్వారా జరిగే ప్రయోజనాలను వివరించాలని, రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేసే లాగా చూడాలని అధికారిని కోరారు.దీనిపై ప్రశాంతకుమార్ రైతులను రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

రైతులకు పంట బీమా వర్తింపజేయాలి

కరప రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తడిసిపోయి రంగు మారి, మొలకలు వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఈ ప్రభుత్వం కొనుగోలు చేయాలని జిల్లా టిడిపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా డిమాండ్ చేశారు. కరపలో గురువారం ఆయన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు పంట బీమా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

తడిసిన ధాన్యం పరిశీలించిన ఎంఎల్ఎ చినరాజప్ప

సామర్లకోట రూరల్మండలంలోని పెదబ్రహ్మదేవంలో భారీ వర్షాలకు తడిసిన ధాన్యం రాశులను గురువారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులు ధాన్యం భద్రపర్చుటకు కనీసం తార్పాలిన్స్ కూడా ఇవ్వడం లేదని, వర్షాలకు తడిసిన ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పిబిదేవం ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు తీరును ఎంఎల్ఎ రాజప్ప పరిశీలించారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు తోటకూర శ్రీనువాసు, కాకినాడ పార్లమెంటరీ పార్టీ తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యులు చౌదరి టిడిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉన్నారు.


పిబిదేవంలో తడిచిన ధాన్యంను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప, టిడిపి నాయకులు


తడిసిన పంటను పరిశీలిస్తున్న తహశీల్దార్ గోపాలకృష్ణ, ఎఒ గంగాధర్

తహశీల్దార్ పరిశీలన

ఏలేశ్వరం :ప్రత్తిపాడు మండలం వొమ్మంగి లో అకాల వర్షాలకు తడిసిన వరి చేలను తహశీల్దార్ గోపాలకృష్ణ ప్రత్తిపాడు వ్యవసాయ అధికారి గంగాధర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ కోసి పనల మీద ఉన్న వరి చేలలో నీరు లేకపోయినట్లతే పంట పొలాల్లో ఉండగానే లీటర్‌కు 50 గ్రాముల ఉప్పు ద్రావణం కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట చేలల్లో నీరు ఉన్నట్లయితే ఎత్తయిన ప్రదేశానికి పనలు తరలించి ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. ఎకరాకు 25 కిలోల ఉప్పు పనల మీద జల్లుతూ కుప్పలు వేయాలన్నారు. ఇలా చేయడం వల్ల ధాన్యం మొలకలు రాకుండా, రంగు మారడాన్ని నివారించవచ్చని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోలుపై రైతు భరోసా కేంద్రాల్లో సహాయకులను సంప్రదించవలసిందిగా రైతులకు తెలిపారు.

కార్టూ'నిజం'



మస్తర్లపై ఎపిడి బహిరంగ విచారణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఉపాధి హామీ పనుల్లో మేట్ల నుండి డబ్బులు తీసుకుని పనికి రాకపోయినా వచ్చినట్టు ఫీల్డు అసిస్టెంట్ సురేఖ మస్తర్లు నమోదు చేస్తున్నారని పలువురు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఉపాధి హామీ కాకినాడ క్లస్టరు ఎపిడి పి.వసంత మాధవి వేట్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొం టున్న ఫీల్డు అసిస్టెంటు కండిపల్లి సురేఖ నుండి, ఫిర్యాదుదారులు బివి సత్యనారాయణ, సర్వసిద్ధి సంధ్య, పిల్లి రాజేశ్వరి, పాతరపల్లి మంగ తదిత రులను విచారించి వారి నుండి వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఉపాధిహామీ ఎపిఒ ప్రభాకరరావు, మాజీ ఉప సర్పంచ్ గోలి వెంకట్రావు, వైసిపి నాయకులు, గ్రామ కార్యదర్శి మోసే, గ్రామస్తులు, పంచాయితీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.


వేట్లపాలెంలో విచారణ నిర్వహిస్తున్న ఎపిడి వసంత మాధవి

అవగాహన లేని మేట్లను మార్చండి

కాగా ఉపాధి హామీ పథకం మస్తర్ల నిర్వహణ విషయంలో మేట్లకు ఎటువంటి అవగాహన లేదని తెలుస్తోందని వారందని తక్షణమే మార్పుచేయాలని ఎపిడి వసంత మాధవి ఎపిఒ ప్రభాకర్‌ను ఆదేశించారు. ఉపాధి కార్డు కలిగిన కూలీ అనారోగ్యం కారణంగా పనికి రాలేని పరిస్థితిలో ఉన్నా, వారి స్థానంలో వారి కుటుంబంలో మరొకరు పనికి వెళ్ళే అవకాశం లేదన్నారు. అటువంటిది బయటివారిని పనిలోకి ఎలా తీసుకుంటున్నారని ఎపిడి ప్రశ్నించారు. బినామీ మస్తర్లు వేస్తున్నారని విచారణలో స్పష్టం అవుతున్నందున విచారణ నివేదికను ఉపాధి హామీ జిల్లా పీడీకి నివేదిక అందజేస్తామని,. తదుపరి చర్యలు ఉన్నతాధికారులు తీసుకుంటారనిఎపిడి వసంతమాధవి తెలిపారు.

అధికారులపై ఎంఎల్ఎ కన్నబాబు ఆగ్రహం

ప్రజాశక్తి -కరప

ఇటీవల నాలుగు రోజుల నుండి కురిసిన వర్షాలకు రైతుల వద్ద ఉన్న మొలకలెత్తి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మండల వ్యవసాయ అధికారులు కొనుగోలు చేయకపోవడంపై కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పంట అనేక చోట్ల దెబ్బతిని రైతులు ఆపదలో ఉన్నారని పంట నష్టం జరిగిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎంఎల్ఎ కురసాల కన్నబాబు హామీ ఇచ్చారు. వాకడ, నడకుదురు గ్రామంలో తడిసిపోయి మొలకెత్తిన ధాన్యం రాశులను, నేల కొరిగి నీట మునిగిన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. దళారులు ద్వారా రైతులకు నష్టం కలిగించే విధంగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని వాకాడ గ్రామంలో రైతులు కన్నబాబు దృష్టికి తీసుకురాగా వ్యవసాయ అధికారులతో ఫోన్లో సంప్రదించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటివరకు తక్కువ ధరకు కొనుగోలు జరిగిన ధాన్యాన్ని మిల్లర్ల నుండి వెనక్కి రప్పించి ఆర్‌బికెల ద్వారా అదే ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం దళారుల ద్వారా మిల్లర్లు చెల్లించే దాని కంటే రూ300 ఎక్కువ వచ్చే విధంగా విక్రయించిన దానికి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ కన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పంట నష్టం జరిగిన ప్రతి రైతును ఆదుకుంటామని రైతులు అధైర్య పడద్దని కన్నబాబు భరోసా ఇచ్చారు. వేములవాడ గ్రామంలో ఇన్చార్జ్ ఆర్‌డిఒ జె సీతారామారావు, తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఆర్ఐ మాచరావు, అగ్రికల్చర్ అధికారుల బందంతో కలిసి తడిసిన ధాన్యం రాశు లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎడిఎ బాబురావు, ఎఒ రాజేష్, జడ్‌పిటిసి వై.సుబ్బారావు, సత్య ప్రసాద్, బుచ్చిబాబు బండి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.


వాకాడలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కన్నబాబు

నేరాలు ఘోరాలు


గాయపడిన యువకులను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

ఉప్పుటేరులోకి దూసుకు వెళ్లిన కారు

- బయటకు తీసిన మత్స్యకారులు
- గాయాలతో బయటపడ్డ యువకులు...

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి
అమీనాబాద్ శివారు ఉప్పుటేరు కాలువలోకి గురువారం ఓ కారు అదుపుతప్పి దూసుకుపోయింది. ఈ కారులో కాకినాడకు చెందిన ఐదుగురు యువకులు ప్రయాణి స్తున్నట్లు సమాచారం. కోనపాపేటకు చెందిన మత్స్యకారుడు క్రాంతి, స్థానిక మత్స్యకారులు కారులో ప్రయాణిస్తున్న యువకులను బయటికి తీసి రక్షించారు. కాకినాడ నుండి పేరుమాళ్లపురం వెళుతుండగా అమీనాబాద్ సమీపం వద్ద ఉన్న ఉప్పుటేరులోకి దూసుకు వెళ్లడంతో కారు పూర్తిగా ధ్వంసం అయినట్లు తెలిపారు. కారులో ఉన్న యువకులు గాయాలవ వడంతో వైద్యం కోసం కాకినాడ ప్రైవేట్ హాస్పటల్ కు తరలించారు. అయితే కారులో ప్రయా ణించిన యువకులు కాకినాడలో చదువుతున్న విద్యార్థులుగా సమాచారం. విషయం తెలుసుకున్న కొత్తపల్లి ఎస్ఐ రామ లింగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని జెసిబి, స్థానికుల సహాయంతో కారును బయటికి తీయించారు.

ఇనుము చోరీ కేసులో మరో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - యానాం
దరియాలతిప్ప వద్దనున్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో ఐరన్ ఫ్లేట్లను దొంగిలించిన కేసులో ఇప్పటికే నలుగురు వ్యక్తులు అరెస్టు కాగా పరారీలో ఉన్న మరో వ్యక్తి నల్లా రాజును బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.గురువారం నల్లా రాజుని కోర్టులో హాజరు పరచగా ఏడు రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.


అధికారులు ఆటోలో స్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యం

పలుచోట్ల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- యంత్రాంగం
తూర్పుగోదావరి జిల్లాలో గురువారం పలుచోట్ల అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ అధికారులు స్వాధీనంచేసుకున్నారు.
రాజమహేంద్రవరంఅక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని కోరుకొండ, రాజమహేంద్రవరం మధ్య అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఒక్క ఆటోలో 20 బియ్యపు బస్తాలు తరలిస్తుండగా ప్లాస్టిక్ బస్తాలలో సుమారు 1000 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యాన్ని రాజమహేంద్రవరం ప్రాంతము అన్నపూర్ణమ్మపేటకు చెందిన ఆటోడ్రైవర్ ఎస్.సత్యనారాయణ, ఎ.చిన్న కొండలరావు తరలిస్తున్నారు. ఈ బియ్యం రాజమహేంద్రవరం ప్రాంతము అన్నపూర్ణమ్మపేటకు చెందిన విశ్వేశ్వరరావుకు చెందినవి. అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.2,40,000. బియ్యం తరలిస్తున్న ఆటోను సివిల్ సప్లయ అధికారులు సీజ్ చేసి 6-ఎ క్రింద కేసు నమోదు చేశారు. పైన తెలిపిన వ్యక్తుల పైన, సంబంధిత వారిపై క్రిమినల్ కేసు నమోదు కొరకు రాజానగరం పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేశ్, కానిస్టేబుల్ లోవరాజు, రెవెన్యూ సివిల్ సప్లయ అధికారులు పాల్గొన్నారు.
రాజమహేంద్రవరంలోని మున్సిపల్ కాంప్లెక్స్ లోని ఒక అద్దె షాపు నెం ఈ 17ను బియ్యం అక్రమ నిల్వకు సంబంధించిన విశ్వసనీయ సమాచారంపై గురువారం విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ అధికారులు కలిసి సదరు షాపును తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 72 బ్యాగ్ లలో సుమారు 3600 కేజీల పిడిఎ బియ్యంను గుర్తించటమైనది. ఈ బియ్యం రాజమహేంద్రవరానికి చెందిన అల్లిరెడ్డి సురేష్ చందర్ చెందినది. ఈ బియ్యానికి సంబంధించి ఎటువంటి బిల్లులు లేనందున సివిల్ సప్లయ అధికారులు సీజ్‌చేసి, 6-ఎ క్రింద కేసు నమోదు చేశా రు. ఈ బియ్యం విలువ రూ.1,94000, అల్లిరెడ్డి సురేష్ చంద్, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు కొరకు సిఫారసు చేయటమైనది.

వేటకు వెళ్లి బాలుని మృతి

ప్రజాశక్తి-కాజులూరు
మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామమైన పల్లం గ్రామంలో గురు వారం స్నేహితు లతో కలిసి ఉప్పుటేరులో చేప లను వేటకు వెళ్లిన పాలెపు జగన్ (14) మృతి చెందాడు. వేసవి సెలవులు కావడంతో తమ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటుందని చేపలవేటకు స్నేహితులతో కలిసి వెళ్లిన జగన్ వెళ్లాడు. ఉప్పుటేరులో అవగాహనలేక పోవడంతో లోతుగా ఉన్నటువంటి నీటిలో దిగడంతో నీట ప్రవాహంలో కొట్టుకుపోయాడు. వెంటనే స్థానికులు అతని తల్లిదండ్రులు పడవల సహాయంతో ఉప్పుటేరులో గాలించగా, వంతెన సమీపంలోని అతని తండ్రికి బాలుడి మృతదేహం దొరకడంతో అతను కన్నీరుమున్నీరయ్యాడు. ఈ ఘటనతో పల్లం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.


పాలెపు జగన్ (ఫైల్ ఫోటో)

యానాం వార్తలు


ఉత్తీర్ణత శాతంపై వైస్ ప్రిన్సిపాల్ చిత్రతో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

ఇంటర్ ఫలితాలపై ఆర్ఎఒ ఆరా

ప్రజాశక్తి - యానాం
ఉంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలపై ఆర్ఎఒ మునిస్వామి వైస్ ప్రిన్సిపాల్ వి.చిత్రను ఆరా తీశారు. ఈ మేరకు ఉత్తీర్ణత శాతం తగ్గడంపై గురువారం కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గత ఏడాది పోలిస్తే ఈఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగిందని కళాశాల సిబ్బంది చెబుతున్నారు. గత మూడేళ్లుగా ఉత్తీర్ణత శాతం తగ్గడంపై అలాగే అధ్యాపకులపై వస్తున్న విమర్శలు వల్లే తనిఖీ నిర్వహించారని పలువురు బాహాటంగా చర్చించుకుంటున్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినప్పటికీ ఉత్తీర్ణత శాతం ఎందుకు తగ్గుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్, వర్తక సంఘం సభ్యులు

ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు సహకరించాలి

యానాం పట్టణంలో పాలిథిన్ బ్యాగ్ల నిషేధానికి వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్ అన్నారు. .గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులు బ్రాండీషాపుల యాజమాన్యాలు, రెస్టారెంట్ల యజమానులు, తోపుడుబళ్ల వ్యాపారులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి ప్లాస్టిక్ బ్యాగ్లు వాడే వ్యాపారులపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అయితే యానాం వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న మాట్లాడుతూ ప్రస్తుతం యానాంలో వ్యాపారులు తక్కువగా ఉన్నాయని జరిమానా వేస్తే వ్యాపారులు ఇబ్బందులు పడతారని కావున ప్లాస్టిక్ నిషేధానికి సమయం ఇవ్వాలని కోరారు. జూన్ 5 వరకు గడువు ఇవ్వాలని వ్యాపారులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన కరపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ మేడిశెట్టి రామలింగేశ్వర రావు, ఖండవల్లి రామకృష్ణ, వ్యాపారులు గాజుల శ్రీరామ్మూర్తి(బాబీ), చెక్కల అరుణ్ కుమార్,నల్లం నాగబాబు,కాపగంటి గోపాలకృష్ణ,శ్రీనివాస్ తోపుడు బళ్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెద్దాపురం
పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి గురువారం తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధర్మకర్తల మండలి నియామకం జరుగుతుందన్నారు. అర్హులైన వారు 20 రోజుల్లోగా తమ దరఖాస్తులను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కాకినాడ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వైభవంగా సత్యదేవుని వన విహారోత్సవం

ప్రజాశక్తి - అన్నవరం
అన్నవరం సత్యదేవుని వార్షిక కళ్యాణోత్సవాలలో భాగంగా ఐదవ రోజు గురువారం నిర్వహించిన స్వామి, అమ్మవార్ల వనవిహారోత్సవం కన్నుల పండువగా జరిగింది. కొండదిగువన గల దేవస్థానం ఉద్యానవనంలో ఈ నిర్వహించిన కార్యక్రమంలో అక్కడ వివిధ జాతుల పూలమొక్కలతో ప్రత్యేక వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్ సమక్షంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ఈ వన విహార వేడుక ముగించారు. అనంతరం రాత్రి 9 గంటలకు వెండిరథంపై స్వామి, అమ్మవార్లకు గ్రామ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రికులను అలరించాయి.


కొండపైన సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సత్యదేవుని కి హుండీల హుండీల ఆదాయం 1.74 కోట్లు
అన్నవరం సత్యదేవునికి హుండీల లెక్కింపు ద్వారా రూ.1,74,78,440 ఆదాయం లభించింది. గురువారం కొండపైన దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్,. పాలక మండలి సభ్యులు ఐదీ సమక్షంలో దేవస్థానం అధికారులు 36 రోజుల్లో వచ్చిన వివిధ హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు తో పాటు 280 గ్రాముల బంగారం, ఒక కేజీ వెండి ఇంకా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించింది. అయితే గత సంవత్సరం ఇవే రోజుల్లో సత్యదేవునికి 1.33 కోట్లు మాత్రమే ఆదాయం రావడంతో గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం 40 లక్షలు ఆదాయం పెరిగిందని దేవస్థానం అకౌంట్ విభాగం అధికారి వై.అప్పారావు తెలిపారు.


దేవస్థానం గార్డెన్‌లో సత్యదేవుని వన విహారోత్సవం, గ్రామోత్సవం

వాహనాలకు జిపిఎస్ సిస్టమ్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
పారిశుధ్యం, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ పరిధిలో పనిచేసే ప్రతీ ఒక్క వాహనానికి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జిపిఎస్)ను అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో కలిసి బొందగుంట లోని వెహికల్ యార్డును సందర్శించారు. అక్కడ ఉన్న కంపాక్టర్లు, జెసిబిలు, సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు సహ మొత్తం 59 వాహనాలను నిలుపుదల చేసే ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా వాహనాల అవసరాన్ని బట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఈ వాహనాల కదలికలు, సమయవేళలను ఎప్పటికప్పుడు గుర్తించి పర్యవేక్షించేందుకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రతీ ఒక్క వాహనానికి జిపిఎస్ సిస్టమ్ పెట్టాలని ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్‌కు సూచించారు. అలా చేయడం వల్ల వాహనాలపై పనిచేసే సిబ్బంది పనితీరు మెరుగుపడడంతో పాటు ఆయా వాహనాల ఎక్కడెక్కడ ఏ ప్రాంతంలో ఉన్నాయో సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు కూడా అందించగలమని కమిషనర్ పేర్కొన్నారు. వాహనాలపై పనిచేసే డ్రైవర్లు, ఉద్యోగులు మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఇఇ వెంకట్రావు, ఎఇ విరూపాక్షం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్ పాల్గొన్నారు.


వెహికల్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

ఎస్‌పి సతీష్ కుమార్‌ను కలిసిన దొరబాబు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్
కాకినాడ జిల్లా నూతన ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్‌ను గురువారం ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు. మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కాకినాడ ఎస్‌పి కార్యాలయానికి వెళ్లి దొరబాబు ఎస్‌పి సతీష్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్‌పి సతీష్ కుమార్‌కు పుష్ప గుచ్ఛం అందచేస్తున్న దొరబాబు

700 వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి - పెద్దాపురం
పట్టణ పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కుక్కల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం నాటికి 700 కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేసినట్లు మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుక్కలకు ఈ వ్యాక్సినేషన్ చేయటం వల్ల కుక్కలు మనుషు లను కరిచినా రేబిస్ వ్యాధి మనుషులకు సోకదన్నారు. ప్రతి వీధిలో మున్సిపల్ సిబ్బంది కుక్కలను పట్టుకుంటే పశు సంవర్థక శాఖ సిబ్బంది వ్యాక్సినేషన్లు వేస్తున్నారన్నారు. వ్యాక్సినేషన్ వేసిన కుక్కలను గుర్తించేందుకు రంగుల ట్యాగ్ వేస్తున్నామన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలోని 29 వార్డుల అన్ని వీధుల్లో కుక్కలకు వ్యాక్సినేషన్ వేసిన అనంతరం రెండవ విడత కార్యక్రమంలో భాగంగా కుక్కల సంతతి పెరగకుండా కుక్కలకు ఆపరేషన్లు చేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.


కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -రౌతులపూడి
శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు రౌతులపూడి సబ్ స్టేషన్ పరిధిలో రౌతులపూడి రూరల్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ కె. రత్నాలరావు గురువారం తెలిపారు. ఈ పరిధిలో గల అన్ని గ్రామాలలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయనకోరారు.


ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరావు

ఉప్పాల్లో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి
ఉప్పాడ రింగ్ రోడ్ లో కొత్తపల్లి ఎస్ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ గురువారం రాత్రి నిర్వహించారు సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ట్రాఫిక్కు అంతరాయం మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారని వెలువడిన వార్త కథనానికి కొత్తపల్లి పోలీసులు స్పందించారు కాకినాడ నుండి వచ్చిన ద్విచక్ర వాహనాలను, ఆటోలను నిలుపుదల చేసి. డ్రంక్ అండ్ డ్రైవ్ ను నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ రామలింగేశ్వరావు మాట్లాడుతూ యువత మద్యం సేవించిద్విచక్ర వాహనాలు నడుపుతున్నారన్న సమాచారంతో ఉప్పాడ రింగ్ రోడ్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు కుటుంబ సభ్యులతో వచ్చిన పర్యాటకులకు ఎటువంటి ఆటంకం జరగకుండా చూస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నిధుల్లేక ఆగిపోయిన జల జీవన్ మిషన్ పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం
పెద్దాపురం మండల పరిధిలోని 23 గ్రామాల్లో అన్ని ఇళ్లకు ఉచితంగా మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయటమే కాకుండా ఆ గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా మంచినీటి ట్యాంకుల నిర్మాణం తదితర సదుపాయాలు కల్పించేందుకు ప్రారంభించిన జల జీవన్ మిషన్ పనులు నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ పథకానికి సంబంధించి పెద్దాపురం మండలంలో రూ 5 కోట్లతో పనులు పూర్తి చేయవలసి ఉంది. ఈ నిధుల్లో సగం కేంద్ర ప్రభుత్వం,సగం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. పెద్దాపురం మండల పరిధిలోని 23 గ్రామ పంచాయితీలలోగల ఇప్పటివరకు రూ 34 లక్షలతో వాలతిమ్మాపురం,రూ 24 లక్షల తో కొండపల్లి కొత్తూరు,రూ 14 లక్షల తో సిరివాడ గ్రామాల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి.మిగిలిన 20 గ్రామాల్లో 9 గ్రామాల్లో 90 శాతం పనులు,8 గ్రామాల్లో 50 శాతం పనులు,3 గ్రామాల్లో 20 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.గ్రామాల్లో చేపట్టిన ఈ పనులకు సంబంధించి చేసిన పనులకు బిల్లులు పూర్తిస్థాయిలో మంజూరు కాకపోవటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు.
త్వరలోనే పనులు ప్రారంభిస్తాం
జలజీవన్ పనులు నిలిచిపోయిన విషయంపై ఆర్డబ్ల్యుఎస్ జెఇ అప్పల రాజును ప్రజాశక్తి వివరణ కోరగా త్వరలోనే ఈ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గంజాయి పట్టివేత : ముఠా అరెస్ట్

ప్రజాశక్తి-బిక్కవోలు
బలభద్రపురంలో తొస్సిపూడి వెళ్లే బ్రిడ్జి వద్ద గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తులను గురువారం బిక్కవోలు పోలీసులు అరెస్ట్‌చేశారు. ఎస్ఐ బుజ్జి బాబు తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది బలభద్రపురం బ్రిడ్జి వద్దకి వెళ్లారు. పోలీసులను చూసి చింతపల్లి మండలం కోటగున్నలు మండలం కోటిగున్నలు మండలం నుంచి పాంగి మోహన్‌కుమార్ చూసి పారిపోయాడు. అతన్ని పట్టుకొని విచారించగా మొత్తం నలుగురు వ్యక్తులు ఉన్నట్లు ఇద్దరు కొనడానికి వచ్చినట్లు అతను తెలిపాడు. కొత్తవీటి మండలం మూలగురువు గ్రామానికి చెందిన పాంగి వినోద్, చింతపల్లి మండలం కోటగుంటు గ్రామానికి చెందిన సింగి రెడ్డి కృష్ణార్జున్, జగ్గంపేట మండలం నీలాద్రిరావు పేట కు చెందిన కర్రి శైలేష్‌కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి వారి నుంచి 30 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.46,200 ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ బుజ్జిబాబు తెలిపారు.


గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

25న వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - పిఠాపురం
అనకాపల్లిలో ఈనెల 25న జరిగే అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం 5 వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు బుగత బంగార్రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏలేశ్వరంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు వంద రోజులు పని కల్పించే పథకంలో మోడీ సర్కార్ మార్పులు చేయడం అన్యాయం అన్నారు. కేంద్రం బడ్జెట్లో కేటాయించిన నిధులతో వంద రోజులు కాదు కదా 15 రోజులు పని చేయడానికి మాత్రమే సరిపోతాయన్నారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ టిపార్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సత్యవేదరావు, జాతీయ కార్యదర్శి దిరెం ద్రరు, రాష్ట్ర కార్యదర్శి వైనాలశెట్టి మూర్తి ఈ సభలకు హాజరవుతారని అన్నారు. సమావేశంలో మానుకొండ లచ్చబాబు, రేచు కట్ల సింహాచలం, సామిరెడ్డి నారాయణమూర్తి, మహేశా నాయకులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం
ప్రజా సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యమని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలోని 24, 26 వార్డుల సచివాలయం పరిధిలో గురువారం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలందరూ ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మున్సిపల్ కౌన్సిలర్లు సేరెళ్లి అంబికా,బొబ్బిలి వీర వెంకట దుర్గ,మున్సిన శ్యామలాంబ ,కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యులు వానపల్లి గంగ,రఫీ, వైసిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన నిరుద్యోగం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
వైసిపి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరగడంతో ఆంధ్ర రాష్ట్ర యువత మాదక ద్రవ్యాలకు బానిసలు అవుతున్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు దేశం మొత్తానికి ఆహారం అందించి అన్నపూర్ణగా నిలిచిన రాష్ట్రం నేడు వైసిపి ప్రభుత్వ పాలనలో గంజాయి మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు హబ్‌గా మారిందని విమర్శించారు. ప్రతిరోజు కొన్ని లక్షల టన్నుల గంజాయి సరిహద్దులు దాటుతున్నా పాలని తరలించే బడా బాబులపై కేసులు మాత్రం నామ మాత్రమేనన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్ర రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య బాగా పెరగడంతో ఉద్యోగ అవకాశాలు లేక యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారన్నారు. విదేశీ పెట్టుబ డులకు అత్యంత ప్రాధాన్యత ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నేడు జే- ట్యాక్స్ కు భయపడి పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారని విమర్శించారు.

4వ రోజు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్
బాలానందినిలయం, జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో మాధవ పట్నం జమునా నగర్ లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ లో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో 'హ్యాండ్ రైటింగ్ స్కిల్స్, కంప్యూటర్ విజ్ఞానం,బాలల పత్రిక "చిట్టి ఊహలు"రూపకల్పన అంశాలపై శిక్షణ తరగతులు జరిగాయి. జన విజ్ఞాన వేదిక విద్యా విభాగం జిల్లా కన్వీనర్ గోపాలకృష్ణ అధ్యక్షత తన స్వనిక కళామందిరంలో నాలుగవ రోజు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. గురువారం రిసోర్స్ పర్సన్ అంగర లక్ష్మీ దుర్గా భవాని కంప్యూటర్ విజ్ఞానంపై వివరించారు పిల్లలే ఎడిటర్లుగా మారి రూపొందించుకొనే చిట్టి ఊహలు బాలలపత్రికను కార్యశాలలో తయారు చేసుకున్నారు. అనంతరం 'హ్యాండ్ రైటింగ్ స్కిల్స్' తరగతులను నిర్వహించారు. నేటి సమ్మర్ క్యాంప్‌లో రామకృష్ణ సేవాసమితి నిర్వాహకులు కె.గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై బాలల సమగ్ర వికాసానికి సమ్మర్ క్యాంప్స్ దోహదపడతాయని అన్నారు. సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

6న జడ్జి క్వార్టర్స్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - పిఠాపురం
ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించనున్న న్యాయమూర్తుల రెసిడెన్షియల్ క్వార్టర్స్ నిర్మాణాలకు ఈ నెల 6న తేదీన శంకుస్థాపన చేయనున్నట్లుట ప్రత్తిపాడు కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి గంధం సునీత, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మనవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ బి.మల్లికార్జునరావు హాజరు కానున్నారని తెలిపారు.


జిల్లా జడ్జి గంధం సునీతను ఆహ్వానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు


తమ పట్టాలు చూపుతున్న బాధితులు


మాట్లాడుతున్న ఎఇ స్వామి

ప్రభుత్వ భూమిపై పెత్తందారుని కన్ను

- మా స్థలాలు మాకివ్వాలంటూ బాధితుల ధర్నా
- విచారణ చేపడతామంటున్నహౌసింగ్ ఎఇ

ప్రజాశక్తి -కాకినాడ కార్పొరేషన్
గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో 2018లో మంజూరు చేసిన తమ స్థలాలు తమకు ఇవ్వాలంటూ తూరంగి స్వామి నగర్ ఏరియాలో గురువారం ధర్నా చేశారు. వివిధ కేటగిరీలలో క్వార్టర్ బాధితులు, వితంతువులు, హెచ్ఐవి బాధితులు, రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన వారు, జగనన్న కాలనీలో పేరు మంజూరు పదించి 63 మంది లబ్ధిదారులకు చిన్న స్వామీనగర్ ప్రభుత్వ స్థలంలో వేసిన అప్రూవల్ లే అవుట్‌లో పట్టాలు కేటాయించారు. ఈ స్థలం స్థానిక పెత్తందారులకు కనబడటంతో ప్రభుత్వ లేఔట్‌ను ప్రైవేట్ లేఅవుట్‌గా మార్చి వేరే వ్యక్తులకు అమ్మారు. విషయం తెలుసుకున్న ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 2019 ఎన్నికల అనంతరం వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక గత ప్రభుత్వంలో వేసిన అప్రూవల్ లే అవుట్ అని అనధికారకంగా స్థానిక 42వ డివిజన్ వైసిపి ఇన్‌ఛార్జి కొరాడ దుర్గ ప్రసాద్ మార్పు చేసి లే ఔట్‌కి అనుకుని ఉన్న కాకినాడ కోటిపల్లి రైల్వేలైన్ భూమిని ఆక్రమించుకుని 63 పట్టాల స్థలాన్ని 93 ప్లాట్లుగా విభజించి బయట వ్యక్తులకు విక్రయం చారని స్థానికుల ఆరోపిస్తున్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన పట్టాలకు స్థలాలు చూపించాలని కోరడంతో అదిగో చూపిస్తా. ఇదిగో చూపిస్తా అని కొరాడ దుర్గాప్రసాద్, కరాటే రాము, ఆకుల సత్తిబాబులు సర్ది చెప్పుకుంటూ వచ్చారని, అసలైన లబ్ధిదారులు వద్ద ఉన్న ఒరిజినల్ పట్టాలు తీసుకుని వేరే వారి పట్టా మార్చి ఇస్తామని తమను ఉద్దేశ పూర్వకంగా మోసం చేశారని ఆరోపించారు. మోసపోయామని తెలుసుకున్న బాధితులు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై హౌసింగ్ ఎఇ స్వామి గురువారం ఆ ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టగా, ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ స్థలంగా ఎలా మార్చారో వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కబ్జా అయిన ప్రభుత్వ స్థలం


కబ్జా స్థలంలో మొదలుపెట్టిన ఇంటి నిర్మాణం